క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్: పట్టణంలోని బస్టాండ్ ఆవరణలో క్రెడాయ్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలి వేంద్రాన్ని బుధవారం మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్ ప్రారంభించారు. కార్యక్రమంలో క్రెడాయ్ సంస్థ చైర్మన్ బండారు ప్రసాద్, ఆమంచి రాజలింగం, నాంపల్లి మనోహర్, వెంకట్‌రెడ్డి, రమేష్, కరుణాకర్ రెడ్డి, మరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మామిడి శ్రవణ్‌కుమార్, జానయ్య తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

చిట్యాల: పట్టణంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని మున్సిపాలిటీ తొమ్మిదో వార్డు కౌన్సిలర్ బెల్లి సత్తయ్య బుధవారం పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. ఆయన వెంట ఆగు అశోక్, చింతపల్లి భిక్షం తదితరులు ఉన్నారు.

అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవం

చండూరు(గట్టుప్పల్) : గట్టుప్పల్ మండల పరిధిలోని తేరట్‌పల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు ఉదావత్ లచ్చిరామ్ విద్యార్థులకు పుస్తకాల ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

దొడ్డి కొమురయ్యకు నివాళి



నివాళులర్పిస్తున్న నాయకులు

మునుగోడు: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటయోధుడు దొడ్డి కొమురయ్య వర్ధంతిని బుధవారం మునుగోడులో ఘనంగా నిర్వహించారు. వివిధ సంఘాల, పార్టీల నాయకులు సీపీఐ కార్యాలయంలో కొమరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి చాపల శ్రీను, డోల్ దెబ్బ సంఘం రాష్ట్ర నాయకుడు మాలిగ యాదయ్య, బండారి శంకర్, పుల్కరం ఆంజనేయులు, అందుగుల మహేష్, నెల్లికంటి మల్లేష్, చిన్న పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న వడ్డెపల్లి శ్రీశైలం

చిట్యాల: మండలంలోని తాళ్లవెల్లెంల గ్రామానికి చెందిన పసుపులేటి భిక్షం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో ఆ గ్రామ మాజీ సర్పంచ్, ఎంవీహెచ్ ఫౌండేషన్ చైర్మన్ వడ్డెపల్లి శ్రీశైలం బుధవారం భిక్షం భార్య ప్రమీలను పరామర్శించి రూ.20 వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట పజ్జూరి అజయ్‌కుమార్‌రెడ్డి, బత్తుల జనార్దన్ గౌడ్, పామనగుళ్ల అంజయ్య, నకిరేకంటి అంజయ్య, దొడ్డి శ్యాం, కొండే రవి, గోపగోని స్వామి, బత్తుల శ్రీశైలం, చెరుకుపల్లి రమేష్ తదితరులు ఉన్నారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో..

చిట్యాల పట్టణానికి చెందిన నిరుపేద నల్లగొండ పెంటమ్మ(55) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందింది. దీంతో ఆమె అంత్యక్రియల నిర్వహణకు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సేకరించిన రూ.40 వేలను బుధవారం మృతురాలి కుటుంబ సభ్యులకు ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు వనమా వెంకటేశ్వర్లు అందజేశారు. కార్యక్రమంలో మహిళ విభాగం జిల్లా అధ్యక్షురాలు పందిరి గీత, సంఘం మండల అధ్యక్షుడు తేరటుపల్లి హన్మంతు, రంగా వెంకన్న, ఇమ్మడి వెంకన్న, పందిరి రమేష్, బూరుగు కృష్ణ, వాసా రామ్మోహన్, బెలిదె సత్యనారాయణ పాల్గొన్నారు.

ట్రాక్టర్, కారు ఢీ.. ముగ్గురికి స్వల్ప గాయాలు

నల్లగొండ క్రైమ్ : నల్లగొండ పట్టణ సమీపంలోని నార్కట్‌పల్లి –అద్దంకి రహదారి పానగల్ సమీపంలో బుధవారం రాత్రి ట్రాక్టర్.. కారు ఢీకొనడంతో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. నల్లగొండ పట్టణ టూటౌన్ ఎస్ఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాదు నుంచి మిర్యాలగూడ వైపు వెళ్తున్న కారును లెప్రసీ కాలనీ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న ట్రాక్టర్ రాంగ్ రూట్‌లో వచ్చి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయని ఎస్ఐ తెలిపారు.

నిరుపయోగంగా సెగ్రిగేషన్ షెడ్లు

- ఒక్కో షెడ్డుకు దాదాపు రూ.2.50 లక్షలు
- నిర్వహణ మరచిన అధికారులు
- చెత్తను గ్రామ శివారుల్లో వేస్తున్న పంచాయతీ సిబ్బంది

కేతేపల్లి: గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణను మెరుగుపర్చడంతోపాటు, గ్రామ పంచాయతీలకు అదనపు నిధులు సమకూర్చాలనే సంకల్పంతో గత ప్రభుత్వం పల్లె ప్రగతిలో భాగంగా సెగ్రిగేషన్ షెడ్లను నిర్మించింది. గ్రామాల్లో సేకరించిన చెత్తను సేంద్రియ ఎరువులుగా తయారు చేసి పంచాయతీలు ఆదాయం పొందాలని వీటి నిర్మాణం చేపట్టారు. కానీ ఈ షెడ్లు కేతేపల్లి మండలంలో ఎక్కడా వినియోగంలో ఉన్నట్లు కనిపించడం లేదు. రూ.లక్షల వెచ్చించి గ్రామాల్లో ఏర్పాటు చేసిన సెగ్రిగేషన్ షెడ్ల నిర్వహణను పంచాయతీలు గాలికొదిలేయడంతో ప్రభుత్వ లక్ష్యం నీరు గారుతోంది.

లక్షల నిధులు వృథా..

కేతేపల్లి మండలంలో 16 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం నిధుల నుంచి దాదాపు రూ.2.50 లక్షలతో ప్రతి గ్రామ పంచాయతీలో సెగ్రిగేషన్ షెడ్ల నిర్మాణం చేపట్టారు. సెగ్రిగేషన్ షెడ్‌లో తడి, పొడి, ప్లాస్టిక్, గాజు, అట్ట, పేపర్ తదితర చెత్తను వేర్వేరుగా నిల్వ చేయడానికి గదులు ఏర్పాటు చేశారు. దీంతోపాటు చెత్త తరలించడానికి ప్రతి పంచాయతీ ట్రాక్టర్లను కొనుగోలు చేసింది. తడి, పొడి చెత్త వేరు చేసేందుకు ఇంటింటికీ బుట్టలు పంపిణీ చేశారు. అయితే సెగ్రిగేషన్ షెడ్ల నిర్మాణాలు పూర్తయినప్పటికీ అవి పూర్తిస్థాయిలో వినియోగంలోకి రావడం లేదు. ప్రారంభ దశలో వాటి నిర్వహణపై ఆసక్తి కనబర్చిన అధికార యంత్రాంగం కాలక్రమేణ వాటిని



కొప్పోలులో నిరుపయోగంగా ఉన్న సెగ్రిగేషన్ షెడ్డు

పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా మారాయి. పారిశుద్ధ్య సిబ్బంది చెత్త సేకరించే సమయంలో తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి డంపింగ్ యార్డుకు తరలించాలి. అక్కడ సెగ్రిగేషన్ షెడ్డులో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అరలలో తడి, పొడి చెత్తను వేయాలి. పొడి చెత్తను అమ్మి ఆ సొమ్మును గ్రామ పంచాయతీ అభివృద్ధికి వినియోగించాలి. తడి చెత్తను దాదాపు 45 రోజుల పాటు దశలవారీగా సేంద్రియ ఎరువు తయారు చేయాల్సి ఉంటుంది. అయితే క్షేత్రస్థాయిలో అవేవీ జరగడం లేదు. చెత్తను డంపింగ్ యార్డు వద్దకు తరలిస్తున్న సిబ్బంది గ్రేడింగ్ చేయకుండా కుప్పలుగా పారబోస్తున్నారు. చెత్తను అడ్డగోలుగా పోస్తుండడంతో ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలు గాలికి పంట పొలాల్లో చేరి రైతులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

డంపింగ్ యార్డులకు తరలని చెత్త

కేతేపల్లి మండలంలోని పలు గ్రామాల్లో చెత్త డంపింగ్ యార్డులకు తరలడం లేదు. గ్రామాల్లో రోడ్ల వెంటనే చెత్తాచెదారం దర్శనమిస్తోంది. దుర్వాసన రావడంతో ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదుల మేరకు పంచాయతీ సిబ్బంది ఆ చెత్తను వారం రోజులకు ఒకసారి తీసుకెళ్లి గ్రామ శివారులో పడేసి మంట పెడుతున్నారు. దీంతో దారిన వెళ్లే వారికి సమస్యగా మారింది. ఇకనైనా అధికారులు స్పందించి సెగ్రిగేషన్, డంపింగ్ యార్డుల నిర్వహణ పూర్తిస్థాయిలో చేపట్టి ప్రభుత్వ లక్ష్యాన్ని సాధించడంతోపాటు గ్రామ పంచాయతీలకు ఆదాయం సమకూర్చేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ఇనుపాములలో గ్రేడింగ్ చేయకుండా కుప్పలుగా పోసిన చెత్త

వినియోగంలోకి తీసుకువస్తాం



గ్రామాల్లో ఏర్పాటు చేసిన సెగ్రిగేషన్ షెడ్లను వినియోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటాం. పంచాయతీ అధికారులతో మాట్లాడి గ్రామాల్లో చెత్తను రోజువారీగా డంపింగ్ యార్డుకు తరలించేలా ఆదేశాలు జారీ చేస్తాం. ప్రతి సెగ్రిగేషన్ షెడ్డులో ఎరువులు తయారు చేసి పంచాయతీలకు అదనపు ఆదాయం వచ్చేలా కృషి చేస్తాం.

–శ్రీనివాసరావు, ఎంపీడీఓ, కేతేపల్లి

బీజేపీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యం

- మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్

మునుగోడు: బీజేపీ అధికారంలో ఉంటేనే దేశంలో గ్రామాల అభివృద్ధి సాధ్యమని మాజీ ఎంపీ, భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్య గౌడ్ అన్నారు. బుధవారం మునుగోడులో జరిగిన బీజేపీ మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికలు ముగిసేవరకు ప్రతి కార్యకర్త నిరంతరం శ్రమించి బీజేపీ గెలుపునకు కృషి చేయాలని కోరారు. గడపగడపకు వెళ్లి కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరించాలని సూచించారు. ఈ నెల 6న బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రతి బూత్‌లో టిఫిన్ బైటక్ సమావేశాలు నిర్వహించాలని సూచించారు. త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో భువనగిరి నుంచి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అంతకు ముందు మండలంలోని రావిగూడెం గ్రామంలో జరిగిన ఈదమ్మ పండుగకు హాజరై కమలం పువ్వు గుర్తుకు ఓటువేయాలని గ్రామస్తులను కోరారు. కార్యక్రమంలో బీజేపీ మునుగోడు నియోజకవర్గ కన్వీనర్ దూడల భిక్షం గౌడ్, జిల్లా కార్యదర్శి బొడిగే అశోక్‌గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు దర్శనం వేణు, మండల అధ్యక్షుడు పెంబళ్ల జానయ్య, నాయకులు బండారి యాదయ్య, మాదగోని నరేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



రావిగూడెంలో గ్రామస్తులను ఓట్లు అభ్యర్థిస్తున్న నర్సయ్య గౌడ్

ఉపాధి కూలీలకు పెండింగ్ బిల్లులు చెల్లించాలి



కొత్తపల్లిలో కూలీలతో మాట్లాడుతున్న సరోజ

నల్లగొండ టౌన్ : ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలకు రావాల్సిన పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మహిళా కూలీల జిల్లా కన్వీనర్ దండెంపల్లి సరోజ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం కొత్తపల్లి గ్రామంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలకు ఇస్తున్న కూలి గిట్టుబాటు కావడం లేదన్నారు. పనులు చేసే చోట కూలీలకు నీడ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. కూలీల సమస్యలన్నీ వెంటనే పరిష్కరించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పరమేష్, రామ్మోహన్, పబ్బిశెట్టి లింగమ్మ, ఎల్లమ్మ, సౌందర్య, శ్రీధర్‌రెడ్డి, వెంకన్న, రేణు, పుష్పలత, మలయ్య తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి సమస్య వస్తే వెంటనే పరిష్కరించండి

మునుగోడు: గ్రామాల్లో మంచి నీటి సమస్య వస్తే అధికారులు వెంటనే స్పందించి పరిష్కరించాలని ఎంపీపీ కర్నాటి స్వామి అధికారులకు సూచించారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. వేసవి కాలంలో ప్రజలు మంచి నీటి కోసం ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఆయా గ్రామాల అధికారులు ముందస్తు జాగ్రతలు తీసుకోవాలన్నారు. వివిధ శాఖల అధికారులు తమ శాఖల ప్రగతి నివేదిక చదివి వినిపించారు. పులిపలుపుల గ్రామ పెద్ద చెరువు నుంచి ఉపాధిహామీ కూలీలు తవ్విన ఒండ్రు మట్టిని ఇటుక బట్టీలకు తరలిస్తున్నారని కోఆప్షన్ సభ్యుడు ఎండీ రఫీక్ సమావేశం దృష్టికి తీసుకొచ్చాడు. ఎంపీపీ మాట్లాడుతూ వివిధ గ్రామాల్లో చెరువుల ఒండ్రు మట్టిని కొందరు వ్యాపారులు రాత్రి సమయంలో ఇటుక బట్టీలకు తరలిస్తున్నారని ఒండ్రుమట్టి రవాణాకు వెంటనే అడ్డుకట్టవేయాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పటికీ అనేక గ్రామాల్లో బెల్టు దుకాణాల ద్వారా మద్యం విక్రయాలు కొనసాగిస్తున్నారని వెల్మకన్నె ఎంపీటీసీ చాపల మారయ్య ఆరోపించారు. సింగారం గ్రామంలోని సగం ఊరికి నేటికీ మిషన్ భగీరథ నీరు సరఫరా కావడం లేదని, దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పలివెల ఎంపీటీసీ చెర్కు కృష్ణయ్య సమావేశంలో ప్రస్తావించారు. ఎంపీపీ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో తహసీల్దార్ ఎం.నరేందర్, ఎంపీడీఓ పూజ, డిప్యూటీ తహసీల్దార్ ఎస్.నరేష్, ఎంపీటీసీలు, వివిధశాఖల అధికారులు, గ్రామ పంచాయతీల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ స్వామి

ట్యాంకును శుభ్రం చేశాకే నీటిని విడుదల చేస్తాం

- నాగార్జునసాగర్ ప్రాజెక్టు సూపరింటెండెంట్ ఇంజనీర్ నాగేశ్వరరావు

నల్లగొండ: నాగార్జునసాగర్ హిల్ కాలనీలోని తాగునీటి ట్యాంకులో కోతులు పడి చనిపోవడంతో ఆ ట్యాంకును శుభ్రం చేశామని, పూర్తిస్థాయిలో ట్యాంకును క్లోరింగ్ చేసిన తర్వాతే తాగునీటిని విడుదల చేస్తామని నాగార్జునసాగర్ ప్రాజెక్టు సూపరింటెండెంట్ ఇంజనీర్ నాగేశ్వరరావు తెలిపారు. అప్పటివరకు ఈ ట్యాంకు ద్వారా నీరు పొందుతున్న ఇళ్లకు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా నీటిని సరఫరా చేస్తామని పేర్కొన్నారు. ట్యాంకులో కోతులు పడి చనిపోయిన సంఘటనపై బుధవారం ఆయన స్పందించారు. నందికొండ హిల్ కాలనీలో 2వేల లీటర్ల సామర్థ్యం ఉన్న రెండు తాగునీటి ట్యాంకులు, వేయి లీటర్ల సామర్థ్యం ఉన్న ఒక ట్యాంకు ఉందని తెలిపారు. అదేవిధంగా కోతులు పడి చనిపోయిన మరో తాగునీటి ట్యాంకు కూడా వేరుగా ఉందని చెప్పారు. ఈ ట్యాంకు ద్వారా 50 ఇళ్లకు మాత్రమే తాగునీటిని సరఫరా చేస్తున్నామని, మూడు రోజులుగా ఈ ట్యాంక్ నుంచి నీరు సరఫరా కావడం లేదని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. చనిపోయిన కోతులను ట్యాంక్ నుంచి తీసేసి శుభ్రం చేసినట్లు తెలిపారు.

శిలాఫలకం ధ్వంసం



ధ్వంసమైన శిలాఫలకం

చిట్యాల: మండలంలోని వెలిమినేడు గ్రామంలో యాదవ సంఘం మరమ్మతుల కోసం ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారని ఆ గ్రామ గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం చైర్మన్ బైకాని నాగరాజు తెలిపారు. ఎన్నికలకు ముందు అప్పటి నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య యాదవ సంఘం భవన నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు కేటాయించి శంకుస్థాపన చేశారని పేర్కొన్నారు. శిలాఫలకం ధ్వంసం చేసిన వారిని గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని చిట్యాల పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఆయన ఫిర్యాదు చేశారు. ఆయన వెంట దుర్గం లింగస్వామి, దాసరి ఐల్య, బైకాని నర్సింహ, ఆవుల నాగరాజు, ఏర్పుల శ్రీశైలం, స్వామి, మహేష్, మల్లేష్ ఉన్నారు.

బీజేవైఎం సాగర్ నియోజకవర్గ కన్వీనర్‌గా సైదులు



నియామకపత్రం అందిస్తున్న జిల్లా అధ్యక్షుడు రాఖీ

మాడుగులపల్లి : భారతీయ జనతా యువ మోర్చా(బీజేవైఎం) కన్వీనర్‌గా మాడుగులపల్లి మండలంలోని అభంగాపురం గ్రామానికి చెందిన కడియం సైదులు నియామకమయ్యారు. ఈ మేరకు బుధవారం యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు వంగూరి రాఖీ జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో సైదులుకు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో బీజేపీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు.

‘ఓర్వలేక అక్రమ కేసులు పెడుతున్నారు’

శాలిగౌరారం: ఆరాధ్య ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్మన్ తాడోజు వాణిశ్రీకాంత్‌రాజుకు ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ చూసి ఓర్వలేక అక్రమ కేసులు బనాయించి అరెస్ట్ చేశారని ఆ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు తాడోజు ఆచారి అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చట్టపరంగా భూమిని కొనుగోలు చేసిన తర్వాత, సంబంధిత వ్యక్తులతో కొందరు నాయకులు తప్పుడు ఫిర్యాదులు చేయించి కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయించారన్నారు. సమావేశంలో ఫౌండేషన్ రాష్ట్ర ప్రతినిధి పర్వతం వెంకటాచారి, ఆకవరం అశోకాచారి, నవీన్‌చారి, వీరాచారిలు పాల్గొన్నారు.

యాదగిరిరెడ్డికి సన్మానం



యాదగిరిరెడ్డిని సన్మానిస్తున్న ఎన్జీ కళాశాల అధ్యాపకులు, సిబ్బంది

రామగిరి (నల్లగొండ): యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మండలం రాగిబావిగూడెం గ్రామానికి చెందిన ఈదులకంటి యాదగిరిరెడ్డికి ఇటీవల ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రకటించింది. నల్లగొండ పట్టణంలోని నాగార్జున ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాజనీతి శాస్త్రం అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఆయన ‘ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని 12, 13 శాసనసభలు, తెలంగాణ రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీల పాత్ర’ అనే అంశంపై ప్రొఫెసర్ సతీష్‌చంద్ర పర్యవేక్షణలో చేసిన పరిశోధనకుగాను డాక్టరేట్ లభించింది. యాదగిరిరెడ్డిని బుధవారం నాగార్జున ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అభినందన సభ ఏర్పాటు చేసి చేశారు. ఈసందర్భంగా ఆయనకు కళాశాల అధ్యాపకులు శాలువా కప్పి పూల బొకే అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాగార్జున ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సముద్రాల ఉపేందర్, కళాశాల అధ్యాపకులు అంతటి శ్రీనివాసులు, బి. వెంకటేశ్వర్లు, పసన్నకుమార్, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

కనగల్: ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ పద్మ, కనగల్ ఏపీఎం సంకు హరి అన్నారు. బుధవారం మండలంలోని తేలకంటిగూడెం గ్రామంలో ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో ఐకేపీ నిర్వాహకులకు రైతులు సహకరించాలన్నారు. కార్యక్రమంలో సీసీ నర్సింహ, సీఆర్‌పీ జానకి, వీఏఏ లక్ష్మీ, రైతులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

శాలిగౌరారం: జిల్లాలో ధాన్యం కొనుగోలు కోసం ఐకేపీ ఆధ్వర్యంలో 175 కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని ఐకేపీ డీపీఎం మోహన్‌రెడ్డి తెలిపారు. శాలిగౌరారం మండలంలోని ఆకారం గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 149 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని వివరించారు. రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం మద్దతు ధర ‘ఏ’ గ్రేడుకు రూ. 2203, ‘బి’ గ్రేడుకు రూ. 2183 కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన విధానం ప్రకారం ధాన్యం విక్రయించిన రైతుల ఖాతాలకు ఐరిష్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం జానకి, మార్కెటింగ్ ఎస్ఆర్‌పీ శాంత, సీసీ బాలు, ఏఈఓ రంజిత్, మహిళా సంఘాల ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

ఐకేపీ కేంద్రం ప్రారంభం

నకిరేకల్ : ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డీపీఎం మోహన్‌రెడ్డి కోరారు. నకిరేకల్ మండలం నోముల గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు పండించిన ధాన్యాన్ని ఆరబెట్టుకుని కేంద్రాలకు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం నరహరి, ఐకేపీ సీసీ కొండ మట్టయ్య,ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వాహకులు శాంత, రాములమ్మ, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.



కనగల్: తేలకంటిగూడెంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ పద్మ



నకిరేకల్: నోములలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీపీఎం మోహన్‌రెడ్డి

శివన్నగూడ, ఖుదాబాక్షపల్లి గ్రామాల్లో ..

మర్రిగూడ: శివన్నగూడ రైతు సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో శివన్నగూడ, ఖుదాబాక్షపల్లి గ్రామాల్లో అధికారులు బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బక్క శ్రీనివాస్, ఎంపీడీఓ జి.చినమునయ్య, ఏఓ ఎం.హేమలత, ఏఈఓ ఎ.ప్రియాంక, ఏపీఓ గుంటుక వెంకటేశం, సీఈఓ వి.మనోహర్ రావు, పంచాయతీ కార్యదర్శి ఎల్.లక్ష్మీ, సిబ్బంది మధుకర్‌గౌడ్, వెంకటేష్, కిరణ్ పాల్గొన్నారు.



శాలిగౌరారం: ఆకారంలో..



మర్రిగూడ: ఖుదాబాక్షపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

కార్యకర్తలను ఇబ్బంది పెడితే సహించం

రామగిరి(నల్లగొండ): తిప్పర్తి మండలంలో కాంగ్రెస్ పార్టీ జెండా మోసిన కార్యకర్తలను ఇబ్బందులు పెడితే సహించబోమని పీసీసీ జనరల్ సెక్రటరీ వల్లె నారాయణరెడ్డి అన్నారు. బుధవారం తిప్పర్తి మండలం మర్రిగూడలో ఆయన మాట్లాడారు. ఇటీవల బీఆర్ఎస్ పార్టీ నుంచి వచ్చిన ఓ నాయకుడు కార్యకర్తలను బెదిరింపులకు గురి చేస్తున్నాడని మండిపడ్డారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డిల దృష్టికి తీసుకెళతానని అన్నారు. పార్టీ కోసం కష్టపడిన కాంగ్రెస్ కార్యకర్తలకు అండగా ఉంటానని అన్నారు. అనంతరం నారాయణరెడ్డిని స్థానిక కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తండు సతీష్‌గౌడ్, గుండు శ్రీనివాస్‌గౌడ్, గుండెబోయిన విద్యాసాగర్, బచ్చయ్య, కాటపల్లి సైదులు, ఎస్ఎస్ చారి, మల్లయ్య, శ్రీను, వెంకన్న, నరసింహ పాల్గొన్నారు.



నారాయణరెడ్డిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కలెక్టర్‌కు వినతి

నల్లగొండ : పట్టణంలోని గొల్లగూడకు చెందిన దాసరి యాదమ్మ తప్పుడు సర్టిఫికెట్ పొంది తమ ఆస్తి కాజేయాలని చూస్తోందని ఆమెపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని అలిసెట్టి పద్మ బుధవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కోర్టు ఉత్తర్వులు అమలు చేసి తమకు న్యాయం చేయాలని కోరారు.

విద్యార్థినుల ప్రతిభ



విద్యార్థినులు అంజలి దైవశ్రీ

చిట్యాల: పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థినులు జాతీయ స్థాయి ఎక్స్‌ప్లోరా ది నాలెడ్జ్ ఒలింపియాడ్ పరీక్ష–2024లో రాష్ట్రస్థాయిలో అవార్డు అందుకున్నారు. పదో తరగతి విద్యార్థిని సీహెచ్.అంజలి, ఐదో తరగతి విద్యార్థిని ఎస్.దైవశ్రీ రాష్ట్ర స్థాయిలో రెండో ర్యాంకు సాధించారు. హైదరాబాద్‌లోని శ్రీ హరిహర కళాభవన్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవులు, ప్రొఫెసర్ కోదండరామ్ విద్యార్థినులకు అవార్డు అందజేశారు. ప్రతిభ చూపిన విద్యార్థినులను కేటీఎస్ అధినేత రాజు, చిట్యాల బ్రాంచ్ స్కూల్ ప్రిన్సిపాల్ బొడ్డు యాదగిరిగౌడ్, డైరెక్టర్ కన్నెబోయిన శ్రీధర్ అభినందించారు.

నీటి ఎద్దడితో గుండ్రపల్లివాసుల అవస్థలు

- నిధులున్నా వినియోగించుకోలేని దుస్థితి
- విధులకు హాజరుకాని ప్రత్యేక అధికారి
- ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులు

చండూరు : మండల పరిధిలోని గుండ్రపల్లి గ్రామంలో భూగర్భ జలాలు అడుగంటి నీటి ఎద్దడి మొదలైంది. సక్రమంగా నీరు సరఫరా కాక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గుండ్రపల్లి గ్రామంలో ఏడు స్కీం బోర్లు ఉన్నాయి. ఇందులో ఓ బోరు పూర్తిగా ఎండిపోయింది. మిగిలిన ఆరు బోర్లు అంతంత మాత్రమే నీళ్లు పోస్తున్నాయి. దీనికి తోడు గ్రామానికి మిషన్ భగీరథ నీరు సైతం అంతంత మాత్రంగానే సరఫరా అవుతోంది.

నిధులున్నా ప్రత్యేక అధికారి లేకపోవడంతో..

గుండ్రపల్లి గ్రామంలో 450 కుటుంబాలు, సుమారు రెండు వేలకుపైగా జనాభా ఉన్నారు. ఈ గ్రామంలో అంతా వ్యవసాయ కుటుంబాలే. మంచి నీటి ఎద్దడి నివారణకు గుండ్రపల్లి గ్రామ పంచాయతీలో సుమారుగా రూ.18 లక్షల నిధులు ఉన్నాయి. కానీ నిధులు ఖర్చు చేసేందుకు ప్రత్యేక అధికారి లేకపోవడంతో సమస్య తలెత్తుతోంది. ఇప్పటికే గ్రామ పంచాయతీ కార్యదర్శి అద్దెకు మోటార్ల సామగ్రి తెచ్చి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నా.. పూర్తిస్థాయితో నీటి సమస్య పరిష్కారం కావడం లేదు. నీటి ఎద్దడి నివారణకు ప్రస్తుతం ఓ బోరును సైతం అద్దెకు తీసుకున్నారు. అంతేకాకుండా చెత్త సేకరణ ట్రాక్టర్‌కు డీజిల్ పోయడానికి కూడా నగదు లేక పంచాయతీ సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. సర్పంచ్‌ల పదవీకాలం ముగియగానే గుండ్రపల్లి గ్రామానికి ప్రత్యేక అధికారిగా మొదటగా ఏఓను నియమించారు. అయితే ఆ ఏఓ గట్టుప్పల్ మండలం తేరట్‌పల్లి గ్రామానికి ప్రత్యేక అధికారిగా మార్చుకున్నారు. దీంతో గుండ్రపల్లి గ్రామానికి పశు వైద్యాధికారిని నియమించారు. కానీ ఆ అధికారి గ్రామానికి రాకపోవడంతో గ్రామంలో ఎక్కడి సమస్యలు అక్కడే పేరుకుపోతున్నాయి.

12 ఏళ్ల తర్వాత ....

గుండ్రపల్లి గ్రామంలో నీటి ఎద్దడి 12 ఏళ్ల క్రితం వచ్చింది. ప్రస్తుతం ఈ వేసవి కాలంలో అదే తీవ్రత వచ్చింది. గతంలో చుక్క మంచి నీరు లేక గ్రామం అతలాకుతలమైంది. అనేక కుటుంబాలు అల్లాడిపోయాయి. ప్రస్తుతం తీవ్రత పెరగక ముందే సమస్యను పరిష్కరించాలని గ్రామ పెద్దలు కోరుతున్నారు. గుండ్రపల్లికి ప్రత్యేక అధికారిని నియమించి నీటి సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



గుండ్రపల్లి గ్రామంలో బోరు మోటార్‌ను రిపేరు చేస్తున్న సిబ్బంది

ముందస్తు చర్యలు తీసుకుంటున్నాం

గ్రామంలో నీటి సమస్య ఉంది..కానీ ముందస్తు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే రైతు నుంచి బోరు అద్దెకు తీసుకున్నాం. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం. గ్రామస్తులు నీటిని పొదుపుగా వాడుకోవాలి. గ్రామంలో సమస్యలు ఉంటే నా దృష్టికి తేవాలి. ఉన్నతాధికారుల సూచనలు, సలహాల మేరకు సమస్యను పరిష్కరిస్తున్నాం.

–అశోక్ రెడ్డి గ్రామ పంచాయతీ కార్యదర్శి